# కొత్తగూడెం పోరగాడికో లవ్‌లెటర్

## సామాన్య కథలు



డా. సామాన్య: ప్రకృతిని పరిశీలించడం, మనుషుల్ని చదవడం ఇష్టమైన అంశాలు. రచన వృత్తి కాదు ప్రవృత్తి. లోలోపల ఆకాంక్షల అభివ్యక్తికి ఎంచుకున్న వాహిక. ప్రాంతం ఏదైనా ఆ పరిసరాలతో సంలీనం కావడం స్వాభావిక లక్షణం. భాష ఏదైనా దానిలో జీవించడం ఆమె అభిమతం. ఏం చెప్పాలన్నదే కాదు ఎలా చెప్పాలన్నది కూడా ముఖ్యం. ప్రక్రియ ఏదైనా పరిపూర్ణత సాధించడం ప్రధానం. జీవిత వైశాల్యమెరిగిన రచయిత్రి. చిత్తూరు జిల్లా మదనపల్లెలో జననం. ఓనమాలు నేర్చింది అక్కడే. నెల్లూరులో గ్రాడ్యుయేషన్ పూర్తయింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. ఎం.ఏ. తెలుగులో స్వర్ణపతకం సాధించారు. అక్కడే 'అంటరాని వసంతం – విమర్శనాత్మక పరిశీలన' పేరుతో ఎమ్.ఫిల్ డిగ్రీ కోసం పరిశోధనా వ్యాసం సమర్పించారు. ఆ తర్వాత 'తెలుగు ముస్లిం రచయితలు–సమాజం–సంస్కృతి'పై పిహెచ్‌డి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. కథ, కవిత, వ్యాసం మొదలయిన ప్రక్రియల్లో రచనలు చేస్తున్నారు. ఎక్కడ వున్నా, ఏం చేస్తున్నా చుట్టూ వున్న మనుషుల్లోని సృజనాత్మక కోణాల్ని దర్శించడం ఓ అభిరుచి, అసాధారణమైనవిగా వుండి కూడా సాధారణంగా కనిపించే అంశాలల్లోని విలక్షణతల్ని కథలుగా మలచడం ఒక ప్రత్యేకత. కథ కోసం కథ రాయడం కాదు. ఇక ఇది చెప్పితీరాలన్న పట్టుదల మాత్రమే రచనకు ప్రేరణ. భాష ఒక ఉన్మత్త పరిమళం. దానిని వాడుకునే కౌశలం కథకు నిండుదనాన్ని చేకూరుస్తుంది. ఈ సత్యం తెలిసిన రచయిత్రి అయినందున కథనరీతుల్లో ప్రయోగాలు చేస్తారు. కథకు కొత్త అందాల్ని చేకూరుస్తారు. తత్ఫలితంగా సామాన్య కథలు పాఠకుల్ని చకితుల్ని చేస్తాయి. కథల్లోని పాత్రలు పాఠకులకు సన్నిహితంగా వచ్చి విభిన్న భావోద్వేగాలకు లోను చేస్తాయి. మంచిలో చెడు, చెడులో మంచి ఎలా దాగి వుంటాయో ఎరుక పరిచే కథా సంవిధానం ఈ కథలకు ఆయువు పట్టు. ఇటీవలే ఆమె రాసిన అంటరాని వసంతం విమర్శనాత్మక పరిశీలన' ఎమ్.ఫిల్ సిద్ధాంత గ్రంథం, 'మహిత' కథ అచ్చయ్యాయి. ఇది సామాన్య మూడో పుస్తకం. తొలి కథా సంపుటి.

కొత్తగూడెం పోరగాడికో

# లవ్ లెటర్

సామాన్య కథలు

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

# కొత్తగూడెం పోరగాడికో లవ్ లెటర్
సామాన్య కథలు


© సామాన్య


gandavarapusamanya@gmail.com



విడుదల : సెప్టెంబర్, 2012

ప్రతులు : 1000

కవర్ పెయింటింగ్ : సామాన్య
కవర్ డిజైన్ : అక్బర్
డిటిపి : ఎం.గిరివర్మ, తిరుపతి

వెల : రూ.100/-

ప్రతులకు : పాలపిట్ట బుక్స్,
16-11-20/6/1/1,
403, విజయసాయి రెసిడెన్సీ,
సలీం నగర్, మలక్‌పేట,
హైదరాబాద్ - 500 036,
ఫోన్:040-27678430.

ముద్రణ : సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై



అన్ని వాదాలను తనలో
మిళితం చేసుకున్న ''నిజాయితీవాది''
మా మామగారు
శ్రీ రాయమల్లు మొఖద్దాంకి ప్రేమగానూ,
ఏ వాదాలూ తెలియని
''బార్న్ ఫెమినిస్ట్'' మా అత్త గారు శ్రీ రాజేశ్వరికి
గౌరవంగానూ...

# కథల వరుస...


| | | |
|---|---|---|
| కల్పన | – | 13 |
| పీ.... యు | – | 25 |
| సీతకష్టాలు.... | – | 37 |
| దొంగలసంత | – | 51 |
| కొత్తగూడెం పోరగాడికో లవ్ లెటర్ | – | 83 |
| అనిత పాడిన పాట | – | 97 |
| మహిత | – | 109 |
| ఆలం కాందొకార్ | – | 133 |
| ఆ పుస్తకం పేరు చెబుతారా...! | – | 151 |
| పుష్పవర్ణ మాసం | – | 161 |

# కొత్త కథలకు ఆహ్వానం

కె.కె.రంగనాథాచార్యులు

ఇవి సరికొత్త కథలు. మూసలో పోసిన కథలు కావివి. నూతన సంవిధానంలో నడచిన కథలు. వేటికవే ప్రత్యేకత గల కథలు. సమకాలిక తెలుగు కథా సాహిత్యంలోనే విభిన్నమైన కథలు. కొత్త కలం నుంచి జాలువారిన కథలు. అనుభవం నుంచి సహానుభవంలోంచి వచ్చిన కథలు. జీవితాలను దగ్గరగా పరిశీలించి రాసిన కథలు. పొల్లుబోని కథలు. చిక్కని కథలు. తగుదునని ఉపదేశాలు చేయవీ కథలు. స్పందింపజేస్తాయి, ఆలోచింపజేస్తాయి. పనిగట్టుకొని నీతులు చెప్పవీ కథలు. అవగాహన కలిగించడమే ఈ కథలు చేసే పని. తొలి ప్రయత్నాలలోనే పరిపక్వతను, పరిణతిని సాధించాయి ఈ కథలు.

ఈ కథలలో వస్తువైవిధ్యం ఉంది. వ్యక్తులు, సన్నివేశాలు, ఘటనల సూక్ష్మాంశ పరిశీలనలున్నాయి. కథలు రచయిత్రి స్వయంగా విన్నవి, తెలుసుకున్నవి, అనుభవించినవిగా కనిపిస్తాయి. జరిగింది జరిగినట్టు దిగిందని అనిపించే కథలూ ఉన్నాయి. రోజువారి జీవితంలో క్షణం తీరిక లేని ఉన్నత కుటుంబాల నిరుత్పాదక ఆడంబర జీవితం ఉంది. దానిని ఆనుకొనే రోజంతా చాకిరీ తప్ప ఏమీ లేని చితికిన జీవితం ఉంది. తమ బతుకులు అలా ఎందుకున్నాయో తెలియని అసహాయు లున్నారు. తెలిసీ తెలియని అమాయకపు జీవితాలలో తమ ప్రసక్తి లేకుండానే ఎదురయ్యే విషాదాలున్నాయి.

వైవాహిక జీవితంలో స్వేచ్ఛ పరిమితమైపోయిన చదువుకున్న మధ్య తరగతి స్త్రీల నిర్వేదం ఉంది. బతుకే పోరాటమైన జీవితాలున్నాయి. తమ నేల కోసం, ఉనికి కోసం సామాన్యులు చేసే ఎడతెగని పోరాటాలున్నాయి. రాజ్యం ఉంది. పాలన యంత్రాంగం ఉంది. అసహాయతను ఉపయోగించుకుని మనుషుల్ని ఆడించి ఉపయోగించుకునే పోలీసు యంత్రాంగం ఉంది. తెలంగాణ ఉద్యమ సందర్భంగా సన్నిహితుల మధ్య ఏర్పడిన అపోహలకు సంబంధించిన వస్తువు కూడా ఒక కథలో ఉంది.

కథలలోని కథా స్థలాలు కూడా భిన్నమైనవి. నెల్లూరు జిల్లా గ్రామాలు, పట్టణాలు మొదలు హైదరాబాద్ వరకు తెలుగు ప్రాంతానికి సంబంధించిన స్థలాలతోపాటు, బెంగాల్, మరీ ముఖ్యంగా ఉత్తర బెంగాల్ బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు కథా స్థలాలు. భిన్న ప్రాంతాలు, భిన్న జీవితాలు, భిన్నమైన సంస్కృతులు, భిన్నమైన ఆహార విహారాలు, భిన్న పరిసరాలు. వీటిని ఒకే స్థాయిలో సూక్ష్మాతి సూక్ష్మంగా చిత్రించి మనముందుంచుతాయి కథలు. భర్త ఉద్యోగం కారణంగా గత కొద్ది కాలంగా రచయిత్రి బెంగాల్‌లో ఉన్నది. కొద్ది కాలంలో అక్కడి జన జీవితంతో కలిసిపోయినట్టు కథలు స్పష్టం చేస్తాయి. ప్రతి అంశాన్ని సన్నిహితంగా చూడగలిగినప్పుడే వాస్తవిక చిత్రణ సాధ్యమవుతుంది. తెలుగు ప్రాంతానికి సంబంధించిన రచయిత్రి కాస్త పరిచయం కావడానికి వీలున్న భద్రలోక్ జీవితాన్ని కాక అట్టడగు బడుగు వర్గాల జీవితాన్ని అంత సహజంగా చిత్రించడాన్ని ప్రత్యేకంగా గమనించవలసి ఉంది. పాలక వర్గాలు మనుషులుగా కూడా లెక్కలోకి తీసుకోని జనాల దయనీయమైన బతుకుల అత్యంత వాస్తవిక చిత్రణ కథలలో కనిపిస్తుంది.

పది కథలలోను శిల్ప వైవిధ్యం కనిపిస్తుంది. భిన్న కథా కథన రీతులు కనిపిస్తాయి. వస్తువుపైన పట్టు, కథనంపైన అధికారం సర్వత్రా కనిపిస్తాయి. ఎక్కువగా కథలు ఉత్తమ పురుష కథనంలో సాగుతాయి. రచయిత్రి తాను దగ్గరగా చూచిన వ్యక్తులను, సన్నివేశాలను, తనకు గల అవగాహనలను, పరిశీలనలను పాఠకులకు పంచడానికి ఉత్తమ పురుష కథనం బాగా ఉపయోగపడింది. 'కల్పన', 'పీయూ', 'మహిత', 'ఆ పుస్తకం పేరు చెబుతారా?', 'ఆలం కాందొకార్' ఉత్తమ పురుషలో సాగిన కథలే అయినా అందులోనే వైవిధ్యం కనిపిస్తుంది. 'కల్పన' కథలో కథకురాలికి, కల్పనకి సమ ప్రాధాన్యం ఉంది. ఇద్దరి సంభాషణలలో వాళ్ల అనుభవాలు, వేదనలు వ్యక్తం అవుతాయి. పీయూ కథ ఉత్తమ పురుష కథనంతో ప్రారంభమైనా ప్రధాన కథ అంతా కథకురాలు చెప్పినట్టుగా ప్రథమ పురుషలో ఉంటుంది. పూర్తిగా ఉత్తమ పురుష కథనంలో నిశ్శబ్ద నిర్మల నది ప్రవాహంలాగా సాగిన విషాద గాథ 'మహిత'. మహిత తన మరణానంతర వృత్తాంతాలను కూడా చెప్పడం కథా కథనంలో ఒక కొత్తదనం. స్థానీయ జీవితాన్ని చిత్రించడంలో మాండలికం నిర్వహించే పాత్రను 'మహిత' కథ తెలియజేస్తుంది. వర్తమానంలోంచి స్మృతులలోకి, విషాద జ్ఞాపకాలలోకి, జీవితాలలోకి ప్రయాణించి, మళ్లీ వర్తమానంలోకి తలపులు తిరిగిన కథ 'ఆ పుస్తకం పేరు చెబు తారా?'. కథనంలో కొత్త ఒరవడి సృష్టించిందీ కథ. 'ఆలం కాందొకార్'లో 'నేను' ఆలం కథనంతో పాటు తానూ సానుభూతితో చివరంటా నడుస్తుంది. భేదాన్ని చెప్పడం (Contrast) ద్వారా చెప్పదలచుకున్న అంశాన్ని వ్యక్తం చేసే పద్ధతి 'అనిత పాడిన పాట'లో కనిపిస్తుంది. సీనియర్ అధికారి కుటుంబం ఆడంబర వాతావరణాన్ని ప్రథమ పురుషలోను, అనిత తన కథను తానే చెప్పుకున్నట్టు ఉత్తమ పురుషలోనూ ఉంటాయి.

'కొత్తగూడెం పోరగాడికో లవ్‌లెటర్' తెలుగు కల్పనా సాహిత్యంలో లేఖా కథనా నికి మంచి నమూనా ఖండికగా నిలిచిపోతుంది. లేఖా కథనాన్ని ఇంత సమర్థంగా ఉపయోగించుకున్న కథలు తెలుగులో చాలా అరుదు. 'సీత కష్టాలు...' అలెగరీ కథన పద్ధతిని చాలా చక్కగా ఉపయోగించుకున్న కథ. సీత కథను, పీత కథను అన్వయించిన రీతి సార్థకంగా కనిపిస్తుంది. మ్యాజికల్ రియలిజం పద్ధతిలో రాయడానికి ప్రయత్నించిన కథ 'పుష్పవర్ణమాసం'. ఈ కథలన్నిటిలోను రచయిత్రి ఆత్మీయ స్పర్శ కనిపిస్తుంది. స్వీయ వ్యక్తిత్వం దర్శనమిస్తుంది. రచయిత్రి కంఠస్వరం వినిపిస్తూ ఉంటుంది. ఈ కథలకు పూర్తిగా భిన్నమైన కథ 'దొంగల సంత'. ఉత్తర బెంగాల్ సరిహద్దులలోని ఒక ప్రదేశంలో దశాబ్దాలు సాగిన నిరంతర పోరాటాల చరిత్ర కథా వస్తువు. అందుకే దీనిని ఆధునిక స్థల పురాణం అనవచ్చు. నలభై సంవత్సరాలకు పైగా సాగుతున్న పోరాటాలు, సంఘటనలు, గుర్తింపులేని సామాన్య జనం, వారి విషాద జీవితం, పెద్దల కుట్రలు, వ్యూహాలు ఆద్యంతం మనసు కదిలించే సన్నివేశాలు, వాటిని కార్య, కారణ పరిణామక్రమంలో కూర్చిన కథనం ఒక నవల చదివిన అనుభవాన్నిస్తుంది 'దొంగల సంత'.

కథా కథన శిల్పంలో సెటింగ్ ది ప్రధానమైన పాత్ర. అది కథా నేపథ్యాన్ని అందిస్తుంది. పాఠకుణ్ణి కథోన్ముఖుణ్ణి చేస్తుంది. ప్రస్తుత కథలలో స్థల కాలాలు, వాతావరణం, పరిసరాలు, సన్నివేశాలు, వర్ణనలు కథానుకూలంగా కనిపిస్తాయి. కథాసారాన్ని సింబలైజ్ చేస్తాయి. పాత్రల, వ్యక్తుల స్వభావాన్ని, మానసిక స్థితిని వ్యక్తం చేయడానికి ఉపకరణాలవుతాయి. 'ఆ పుస్తకం పేరు చెబుతారా?' కథలోని ఒక సెటింగ్ మంచి ఉదాహరణ. నగరం నడిబొడ్డులో ఒక అందమైన ఇల్లు. ఇంట్లో ఆకర్షించే అమరికలు. అందులో అందంగా అమరిన పడకగది. నిశ్శబ్దంగా ఉన్న ఇంట్లో చిన్న ఎక్వేరియంలో చిరు చేప నీలిమ. పడక గది మీదుగా అల్లుకున్న మల్లెతీగ కిటికీ దాటుకొని వెళ్లిపోయింది. గదిలో మంచంపై చిన్న ఎక్వేరియంలోని నీలిమను పరికిస్తూ, పలకరిస్తూ తను. ఎదురుగా జామ చెట్టుకొమ్మపైన అస్తిమితంగా అటూ ఇటూ దిక్కులు చూస్తున్న పసుపు రంగు పిట్ట – వైవాహిక జీవితం స్త్రీకి పంజరపు బతుకులాంటిదన్న సూచన ఇక్కడ ఉంది. తరువాత కథకిది నేపథ్యాన్నందిస్తుంది. కథలలో అందమైన వర్ణనలు కనిపిస్తాయి. నెమళ్లు, కోయిలలు, రకరకాల పక్షులు, సంపెంగలు, మల్లెతీగెలు మామిళ్లు, చివుళ్లు, రంగులు, రకరకాల రంగుల కలయికలు, మేఘాలు మొదలైన ప్రకృతి గత అంశాలు కనిపిస్తాయి. అందమైన వాతావరణం వెనుక విషాదాన్ని వర్ణించడం రచయిత్రి అవలంభించిన పద్ధతులలో ఒకటి. కొన్ని కథలలోని సాహిత్య వాతావరణం కథోద్దేశ్యాన్ని ఉద్దీపింపజేస్తాయి. ప్రసిద్ధ కవుల కవితా పంక్తులు అలవోకగా కథలలో దొర్లుతాయి. సందర్భంలో, కథనంలో కలిసిపోతాయి. గురజాడ, ఉమర్ అలీషా, శ్రీశ్రీ, బాల గంగాధర తిలక్, ఎంకిపాటలు, రావిశాస్త్రి, గద్దర్, గోరటి

వెంకన్నలతోపాటు భవయ్య వంటి బెంగాలీ జానపద గీతాలు కథలలో సందర్భాను సారంగా ప్రసక్తమవుతాయి. బహువిధాలుగా సాహిత్యాన్ని ప్రస్తావించిన తీరు ఆధునిక తెలుగు సాహిత్యంపైన రచయిత్రికి గల ఆసక్తిని, అభిరుచిని తెలియజేస్తాయి.

తొలిదశలోనే తనదంటూ ఒక ప్రత్యేకమైన శైలిని రూపొందించుకుంది రచయిత్రి. నిరాడంబరమైన శైలిలోనే సాంద్రత కనిపిస్తుంది. సరళశైలిలోనే విషాదాన్ని గుప్పిస్తాయి కథలు. విషాద జీవితాలను చిత్రించే సందర్భాలలో కూడా భావోద్విగ్నతను ప్రదర్శిం చని సంయమనం శైలిలో కనిపిస్తుంది. సంఘటనలు సర్వసాధారణంగా జరిగిపో తున్నట్టు ఉంటాయి. అందులోనే గంభీర జీవితం దర్శనమిస్తుంది. ఎక్కడా సడలని పటిష్ఠమైన నిర్మాణం కలిగి ఉంటాయి కథలు. కథలోని ప్రతి వాక్యం అర్థవంతంగా ఉంటుంది. ఏ ఒక్క వాక్యం దృష్టిలోంచి తప్పినా కథార్థం సమగ్రంగా అవగతం కాదు. ప్రశ్నార్థకాలు, కిలార్థకాలు, నిశ్చయార్థక వాక్యాలు పాఠకులను ఉత్తేజితుల్ని చేసి ఆలోచింప జేస్తాయి.

సంకలనంలో స్త్రీపరమైన కథలు ఎక్కువగానే కనిపిస్తాయి. కొన్ని కథలు ప్రత్యేకంగా ఒక స్త్రీ చుట్టూ తిరుగుతాయి. స్త్రీ వ్యక్తిత్వం, అస్తిత్వం, స్వేచ్ఛ, జీవిత ఘర్షణ, ఒంటరి పోరాటాలు, అసహాయత, అణచివేత, హింస కథలలోని విషయ వస్తువులు. ఎక్కడా సిద్ధాంత ప్రవచనాలు ఉండవు. పదజాలాన్ని గుప్పించడం ఉండదు. వ్యక్తులుంటారు. అనుభవాలుంటాయి. సన్నివేశాలు, సంఘటనలు ఉంటాయి. జీవితం ఉంటుంది. వాస్తవాలుంటాయి. కల్పన, పీయూ, అనిత, పూలేశ్వరి (దొంగల సంత), మహిత, 'నేను' వీణటీచర్ వాళ్ల (సవతి) అమ్మ ('ఆ పుస్తకం పేరు చెబుతారా?'), పీత, సీత ('సీత కష్టాలు...'), వీణాధరి ('పుష్ప వర్ణమాసం'), షాహిన్ ('కొత్తగూడెం పోరగాడికో లవ్‌లెటర్') భిన్నమైన జీవితాల నుంచి వచ్చిన వారు. భిన్నమైన ఆర్థిక వర్గాలకు, భిన్న బౌద్ధిక స్థాయిలకు, మానసిక స్థితులకు చెందిన వారు.

సామాజిక, రాజకీయ, సాహిత్య, ప్రాంతీయాంశాల మీద తరచుగా వాదాలు చేసుకొనే భార్యభర్తల (ప్రియాప్రియులు కూడా) మధ్య (మిత్ర వైరుధ్యమే అయిన) ఘర్షణ ఇతివృత్తంగా పరిణతితో నిర్వహించిన కథ 'కొత్తగూడెం పోరగాడికో లవ్‌లెటర్'. తెలంగాణ ఉద్యమ సందర్భం కథకు ముఖ్యమైన భూమిక. భార్యాభర్తలు తెలుగునాట భిన్న ప్రాంతాలకు చెందిన వారు. జంట ఉంటున్నది తెలుగునాడులో కాదు. దేశంలో మరో భాషా రాష్ట్రంలో. భార్యకు తెలంగాణ ఆకాంక్షల విషయంలో సానుభూతి అంగీకారం ఉంది. అయినా ఆమెపైన కోస్తాంధ్ర ముద్ర పడుతూనే ఉంటుంది. ప్రాంతాల వారీ మనుష్యుల స్వభావాలను, వర్తనలను సాధారణీకరించి పరస్పరం ఒకరిపై ఒకరు చేసే వ్యాఖ్యలు, అనుమానాలు, ముద్రలు, అసహనం వంటి అంశాలు

కథలో ప్రసక్తం అవుతాయి. సంక్లిష్టమైన ఆధిపత్య, ఆధిక్య సంబంధాల నేపథ్యంలో వ్యక్తి సంబంధాలను, స్త్రీ పురుష సంబంధాలకు సంబంధించిన సున్నితమైన సమస్యలను ముందుకు తీసుకుని వస్తుంది కథ. తెలంగాణ ఉద్యమం తీవ్రతను అందుకున్న సందర్భంలో ప్రియుడు, ప్రియురాలు అన్నభావనలతో కవితలు, కొన్ని కథలు వచ్చాయి. అవి తాత్కాలిక ఉపశమనం కలిగించడం కోసమో, సమాధాన పరచడం కోసమో రాసినట్టు కనిపిస్తాయి. కొన్నిటిలో కృత్రిమమైన సెంటిమెంట్ కూడా కనిపిస్తుంది. ప్రస్తుత కథ నడుస్తున్న చరిత్రకు, జరుగుతున్న సంఘటనలకు సంబంధించిన అవగాహనకు, పరిజ్ఞానానికి, సానుకూల దృష్టికి నిదర్శనం. లేఖా కథన రూపంలో తన భావాలను స్పష్టం చేయడానికి, అభిప్రాయాలను విశదీ కరించడానికి రచయిత్రికి ఉన్న సాహిత్య నేపథ్యం బాగా ఉపకరించింది. వాదాలు, అభిప్రాయ భేదాలు మనిషిని మనిషిగా చూడడానికి ఆటంకం కానవసరం లేదని కథ చెప్తుంది.

'దొంగల సంత' దేశంలోని బడా దొంగల సంతలకు చిరు నమూనా మాత్రమే. సరళీకృత ఆర్థిక విధానం పేరిట ప్రవేశపెట్టిన ప్రత్యేక ఆర్థిక మండలాలు (Sez) సృష్టించిన బీభత్సం, ఆర్థిక అరాచకత్వం, వివక్ష లేకుండా చేసే భూసేకరణలు, భూనిర్వాసితుల అగమ్య గోచర జీవితాలు అందరికీ తెలిసిన విషయాలే. ప్రస్తుతం ఉన్న ప్రధాన వ్యవస్థలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా విధానాలను బడా వ్యాపారులు శాసిస్తున్న విషయాన్ని కూడా గమనిస్తాం. నిర్దిష్టమైన సిద్ధాంతాలున్న రాజకీయ పక్షం అధికారంలో ఉన్నా ప్రధాన స్రవంతి ప్రభావాలు తప్పవు. అందులోనూ సుదీర్ఘ కాలం ఎదురులేని అధికారంలో ఉన్నప్పుడు నిరంకుశ ధోరణలు తలెత్తడం సహజం. ఆ క్రమంలోనే ఉత్తర బెంగాల్‌లోని తుఫాన్ బిహార్ ప్రాంతంలో దోల్‌మేళామాట్‌లో పెద్ద వ్యాపారులు స్థానిక నాయకులతో కుమ్మక్కై ప్రభుత్వ విధానాన్ని శాసించిన వృత్తాంతాన్ని చెప్పే కథ 'దొంగల సంత'.

దోల్‌మేళామాట్‌లో తరాలుగా జరుగుతున్న సంత రాణీర్‌హాట్. అక్కడ ధాన్యం, పశువులు, జనుము, బట్టలు అమ్ముకొనే పెద్ద వ్యాపారులతో పాటు దీపపు బుడ్లు, సూదులు, పిన్నీసులు, లాంతర్లు అమ్ముకొనే చిన్న వ్యాపారులు వ్యాపారం చేసు కుంటారు. రాణీర్‌హాట్ భూమిలో తుఫాన్ బిహార్ రెగ్యులేటెడ్ మార్కెట్ కమిటీ ఆఫీసు నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. ప్రజలు సంవత్సరాలు పోరాడి తెచ్చుకున్న 'పార్టీ' ప్రభుత్వం వచ్చినా విధానాలు మారలేదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా చూపించిన కాళీబారి ప్రాంతానికి చిన్న వ్యాపారులు వెళ్లారే కాని పెద్ద వ్యాపారులు వెళ్లలేదు. స్థానిక నాయకులను ప్రలోభ పెట్టి ఎవరిదీ కాని నదీ తీర ప్రాంతంలో వ్యాపారం పెట్టుకున్నారు పెద్ద వ్యాపారులు. పన్ను కూడా కట్టవలసిన అవసరం లేకుండా చేసుకున్నారు. తీర ప్రాంతంలో వెలసింది గనుక దానికి చరేర్ హాట్ అని పేరు వచ్చింది. జనుల నోళ్లలో నలిగి అది చోరేర్ హాట్ అయింది. పెద్ద వ్యాపారాలు లేకుండా చిన్న

వ్యాపారాలు నడవడం కష్టం. సంత మొత్తం కాళిబారికి రావాలని ఉద్యమం మొదలైంది. కాళిబారి మార్కెట్ యార్డ్‌కి ఒక వైపున నవోదయ పాఠశాల పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. పిల్లలకి మేలు జరుగుతుందని ప్రభుత్వం మార్కెట్ యార్డ్ మధ్యకు నవోదయ పాఠశాల స్థలాన్ని మార్చింది. 'సంత భూమిలోకి మొత్తం సంత రావాలి' అన్న నినాదం పోయి, 'సంత భూమిలో సంత, నవోదయ భూమిలో నవోదయ' నినాదంతో పోరాటం మొదలైంది. ఈ క్రమంలో భూ నిర్వాసితులైన వారు, ఉనికిని కోల్పోయిన వారు సామాన్యులు. నష్టపోయిన వారు చిన్న వ్యాపారులు. వాళ్లకు మిగిలింది పిటిషన్లు, ధర్నాలు, పోరాటాలు. ప్రభుత్వాలు మారుతున్నాయి, తరాలు మారుతున్నాయి, సామాన్యుల బతుకు పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. 'దొంగల సంత'కు తోడు కథ 'ఆలం కాందొకార్'. సుమారు అదే ప్రాంతానికి సంబంధించిన కథ. జమీందారీ స్థాయి కుటుంబం నుంచి వచ్చి చితికిపోయి పరిస్థితుల వలలో చిక్కుకుని పోయిన వాడు ఆలం. పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా పనిచేశాడు. అపాయాలను లెక్కించకుండా అన్ని రకాలుగా సహకరించాడు. వయసుతో అలసి పోయి ఇంకా నేను పనిచేయలేనని అన్నప్పుడు ఆయనపైనే డెకాయిటీ కేసు పెట్టడానికి సిద్ధ పడ్డారు పోలీసులు.

సంకలనంలోని కథలు రచయిత్రి ఒక సంవత్సర కాలంలో రాసినవి. తొలి కథలు కూడా. కథా వస్తువులు పూర్తిగా భిన్నమైనవి, వైవిధ్యం కలవి. తక్కిన కథలతో పోల్చినప్పుడు 'దొంగలసంత' దానితోపాటు 'ఆలంకాందొకార్' విభిన్నమైన వస్తువు గల కథలు. అన్ని రకాల వస్తువులను ఒకే స్థాయిలో నిర్వహించగలగడం రచయిత్రి ప్రత్యేకత. విషయాన్ని బట్టి, వస్తువును బట్టి కథన శిల్పాన్ని అనుసరించడంలో కూడా ప్రత్యేకత కనిపిస్తుంది. కథలు పత్రికలలో ప్రచురితమైనప్పుడు పాఠకుల నుంచి వచ్చిన స్పందనలే కథల విలువను తెలియజేస్తాయి. – ఇవి సామాన్య కథలేకాని సామాన్య కథలు కావు, అసామాన్య కథలు.

కల్పన

దాలియ పూల మొక్కలు నిండి పోయిన దారి వెంబడి, క్లాస్ రూంలోకి
వెళ్తూ వెళ్తూ, ఆగి ''అమ్మా! నన్ను తీసుకెళ్ళడానికి నువ్వే వస్తావు కదా!
ప్రామిస్ కదా!'' అంది పాపాయి. పువ్వుల్లో పువ్వులా కలిసిపోయి,
ముద్దుగా అందంగా కన్నుల పండువలా వుంది. తనివితీరా చూసుకుంటూ
''ప్రామిస్ రా... వస్తాను'' అన్నాను.

పూలను చూస్తుంటే జ్ఞాపకమొచ్చింది. ఇవాళ 'ఇకెబెన' క్లాసుంది. వెళ్ళాలి. ఏవేవో పనులు. ప్రతి రోజూ ఉండేవే అయినా ఇవాళ కొంత ఎక్కువ. ఎన్ని పనులున్నా ఇకెబెన క్లాసు వదలబుద్ది కాదు. కళ్ళకు ఇంపుగా రంగు రంగుల పూలు, రెమ్మలు.... పరిమళాలు... అమర్చుతూ వెళితే ఆ అమరిక ఎక్స్ప్రెస్ చేసే ఫైనల్ ఫీలింగ్... ఎంత బాగుంటుందో... అసలు ఫస్ట్ ఆ రంగులే మనసుకు ఏదో శాంతినిస్తాయ్. ఓదారుస్తాయ్. అందుకే క్లాస్‌కి ఆబ్సెంట్ కాబుద్ది కాలేదు.

****

క్లాస్ దగ్గర స్కూటీకి స్టాండ్ వెయ్యబోతుంటే పక్కనే ఇంకో స్కూటీ వచ్చి ఆగింది. తను ఇకెబెనలో నా బాచ్‌మేట్ కల్పన. హెల్మెట్ తీసి చెమట తుడుచుకుంటూ, ''ఎంత ఎండలండి అప్పుడే, ఈవినింగ్ బాచ్‌కి వద్దామంటే ఇంట్లో కుదరదు'' అన్నది. నేను ఔనని తల ఊపాను.

ఇద్దరం వెడల్పాటి మెట్లు ఎక్కుతూ ఆ కాంప్లెక్స్ చివరనున్న క్లాస్‌కి వెళ్లాం.

మా బాచ్‌కి అదే చివరి క్లాసు. అందరికీ వీడ్కోలు చెప్పి బయట పడ్డాను.

****

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ లో హ్యూమన్ రైట్స్ డిస్టెన్స్ జాయినయ్యాను. ఇంకో రెండు రోజుల్లో ఎగ్జామ్స్. ఇంటి నుండి వెళ్లి రావడం అంటే దాదాపు ఇరవై కిలోమీటర్లు ప్రయాణం. అదెలా వున్నా ఇప్పటి దాకా ఒక్క ముక్కా చదవలేదు. అందుకే పిల్లని అమ్మమ్మకి అప్పగించి యునివర్సిటీ గెస్ట్‌హౌస్‌కి వచ్చేసాను.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=1391](http://kinige.com/kbook.php?id=1391)**

* * *

**Read other books by Dr. Saamaanya @**

**[http://kinige.com/kbrowse.php?via=author&name=Dr.+Saamaanya&id=347](http://kinige.com/kbrowse.php?via=author&name=Dr.+Saamaanya&id=347)**